ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

శనివారం 14 డిసెంబరు 2024

ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలో టీపీయూఎస్ ఆధ్వర్యంలో ధర్మా గ్రహ దీక్ష పోస్టర్‌ను నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ నాయకులు మాట్లాడుతూ నాలుగు పెండింగ్ డీఏలు, కొత్త పీఆర్‌సీ అమలు కోసం డిసెంబరు 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న ధర్మా గ్రహ దీక్షకు ఉపాధ్యాయులు అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. నూతన పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లును త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర బాధ్యులు రొట్టె శ్రీనివాస్, జిల్లా బాధ్యులు బండి మహేష్, కాశెట్టి రమేష్, ధర్మపురి మండల అధ్యక్షులు కాశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్, కార్యవర్గ సభ్యులు కాశెట్టి వెంకట రమణ, సుద్దాల మదు, బండి ప్రవీణ్, శీలం రాజేష్, మారంపెల్లి రాజేష్, బుగ్గారపు హరీష్, చల్ల కృష్ణ పాల్గొన్నారు.

లక్ష సాయం ఎటు పాయె..?



బీసీ కుల వృత్తిదారులకు గతంలో సర్కారు ఆర్థిక సాయం

పథకం అమలుపై కాంగ్రెస్ సర్కారు ఆరా

వినియోగపత్రాలు సమర్పించాలని ఆదేశాలు

ఆందోళనలో పలువురు లబ్ధిదారులు

జగిత్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యేడాదిన్నర కిందట బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు మంజూరు చేసిన రూ. లక్ష ఆర్థిక సాయంపై కాం గ్రెస్ ప్రభుత్వం ఆరా తీస్తోంది. లబ్ధిదారులు స్వయం ఉ పాధి నిమిత్తమే ఖర్చు చేశారా... లేక ఇతర అవసరాలకు వాడుకున్నారా... అని విచారణ చేపడుతోంది. డబ్బులను దేనికోసం ఖర్చు చేశారో.. తప్పనిసరిగా వినియోగ పత్రాలు (యూసీ) సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దుర్వినియోగమైతే నగదును రికవరీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో అధికార యంత్రాంగం బల్దియాల్లో, పంచాయతీల్లో లబ్ధిదారుల జాబితా పట్టుకుని ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టనున్నారు.

జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల సంఖ్య...

అర్హులకు రూ. లక్ష రుణాలను పంపిణీ చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జూన్ 6వ తేదీ నుంచి 2023 జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆన్‌లైన్ ద్వారా జిల్లాలోని చేతి, కుల వృత్తి దారులు దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 17,277 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుడు వయస్సు 18 నుంచి 55 ఏళ్ల లోపు ఉండాలని, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాం తంలో రూ. 2 లక్షల ఆర్థిక ఆదాయం ఉన్న వారిని అర్హులుగా పరిగణించారు. రేషన్ కార్డు, కుల, ఆదాయం, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా జిల్లాలోని కుల, చేతి వృత్తిదారులు బీసీ రుణాల కోసం జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పకడ్బందీ పరిశీలన అనంతరం అర్హులను సర్కారు ఎంపిక చేసింది.

జిల్లా వ్యాప్తంగా రూ. 11.87 కోట్లు పంపిణీ..

జిల్లా వ్యాప్తంగా 1,187 మంది లబ్ధిదారులను బీసీ బంధు పథకం కింద ఎంపిక చేసి రూ. 11.87 కోట్ల ఆర్థిక సహాయాన్ని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో పంపిణీ చేసింది.

మిగతా 8వ పేజీలో...

ప్రైవేట్ రంగంలో అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని యువత ముందుకు సాగాలని జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారిణి సత్యమ్మ యువతకు సూచించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో దుబాయ్‌లో పనిచేయుటకు బైక్‌రైడర్స్, సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం శుక్రవారం పట్టణం లోని స్థానిక టౌన్‌హాల్‌లో గల శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగావకాశాల నిమిత్తం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన ఈ ఎన్‌రోల్ డ్రైవ్ మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగిందని, ఇందులో సుమారు 80మంది వరకు అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు సత్యమ్మ తెలిపారు. ప్రభుత్వం తరుపున నిర్వహించే ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లింగమూర్తితో పాటు సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన కమిషనర్



హాస్టల్స్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలు, కేజీబీవీ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఆయన వసతి గృహాల్లో భోజనశాలను, పరిసర ప్రాంతాలను సందర్శించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అంటూ ఆయన నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిసర ప్రాంతాలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయించి, మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పర్యవేక్షించారు. సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పలు సలహాలు, సూచనలు ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులకు ధర్మపురి, బుగ్గారం మండల విద్యాధికారులు సీతాలక్ష్మి, వేంకటేశ్వర్లు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేసి వాటర్ హీటర్లు ఏర్పాటు చేశారు. మండల విద్యాధికారులు మాట్లాడుతూ విద్యార్థులు వేడి నీళ్ల స్నానం చేసేందుకు ప్రభుత్వం ద్వారా సరఫరా వాటర్ హీటర్లను అమర్చడం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చక్కగా విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అరుణ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి

జయశంకర్

విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో వక్తలు

7



వ్యవసాయ సాంకేతికతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అతిథులు

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

8



త్రాసుతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

అందరికీ అందుబాటులో మెడికవర్ ఫ్యామిలీ కార్డు : కలెక్టర్ సత్యప్రసాద్



ఫ్యామిలీ కార్డును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ ఆసుపత్రి ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ కార్డుతో రోగులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తప్పడంతో పాటు వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మెడికవర్ ఆసుపత్రి ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ కార్డును కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడారు. పేషంట్ ఒక్కసారి ఆసుపత్రి నుంచి ఫ్యామిలీ కార్డు పొందితే 25 శాతం డాక్టర్ కన్సల్టేషన్‌పై, 15 శాతం రక్తపరీక్షలపై 10 శాతం డేకేర్ క్యాష్ అడ్మిషన్‌పై డిస్కౌంట్ ఉంటుందన్నారు. 30 శాతం హెల్త్‌కేర్ సేవలపై, 20 శాతం మందులపై 10 శాతం హెల్త్ చెకప్‌పై రాయితీ ఇవ్వడంతో పాటు 10 కిలోమీటర్ల లోపు ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్డు పొందిన వారు దేశంలోని ఏ మెడికవర్ హస్పిటల్‌కు చికిత్స కోసం వెళ్లినా ఈ సౌకర్యాలు పొందే అవకాశం ఉందన్నారు. అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ పాల్గొన్నారు.

మతం మారిన కుటుంబాలకు రిజర్వేషన్లు తొలగించాలి

తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు మతం మార్చుకుని మళ్లీ ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు పొందుతున్న కుటుంబాలను వెంటనే విచారించి వారికి రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ ఖయ్యూంకు వినతి పత్రం సమర్పించారు. గిరిజన గ్రామమైన జగన్నాథ్‌పూర్‌లో నూటికి 50 శాతం గిరిజన ప్రజలు మతం మార్చుకున్నట్లు తెలిసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన పేరిట చేసిన సరేవలు మతం మార్చుకున్న ఎస్సీ, ఎస్టీల వివరాలు తప్పుగా నమోదు చేశారని, వెంటనే వాటిని పరిశీలించి నిజమైన దళిత గిరిజనులకు రిజర్వేషన్ల ఫలాలు చెందాలని కోరారు. గ్రామంలో రెండు చర్చిలు అక్రమంగా నిర్మించారని, వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్, సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ చేయాలని ధర్నా

జగిత్యాలరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లింగంపేట రైల్వే స్టేషన్ నుంచి నిజామాబాద్ జాతీయ రహదారి వరకు రహదారి విస్తరణ చేయాలని హస్నాబాద్ శివారులో నిజామాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం అంబారిపేట, హస్నాబాద్, లింగంపేట గ్రామస్థులు ధర్నా చేశారు. రోడ్డు విస్తరణ చేయకపోవడం వల్ల రైల్వేస్టేషన్‌కు వచ్చే ట్రాన్స్ పోర్టు వాహనాల వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వారం రోజుల్లో రోడ్డు విస్తరణ పై నిర్ణయం వెలవడించకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.

సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలకు చల్‌గల్ విద్యార్థులు

జగిత్యాల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 11 నుంచి 13 వరకు జగిత్యాల వివేకనంద మినీ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి, ఖో-ఖో పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. అథ్లెటిక్ విభాగంలో కౌశిక్, అక్షయ, అప్సర, గౌతమ్, హరిణి, విష్ణులు బహుమతులు సాధించారు. ఈనెల 21న జరిగే జిల్లాస్థాయి పోటీలకు జగిత్యాల మండల వాలీబాల్ జట్టుకు గమ్య, సంజన, హరిణి, సిరిన్ మిత్ర, గీతిక, ఎంపికకాగా బాలుర వాలీబాల్‌కు రాజేష్, ఖోఖో జట్టుకు అక్షయ, నిచిత, పూర్విక, అనుప్రియ, గౌతమ్, కౌశిక్, కబడ్డీ పోటీలకు రక్షిత, సాత్వియా, సంజన, సిరిన్, మిత్రలు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు లతాదేవి, పాఠశాల చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే నిరవధిక సమ్మె

డీపీవోకు ఉద్యోగుల జేఏసీ సమ్మె నోటీసు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 20వ తేదీన గ్రామ పంచాయతీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు పిలువనట్లయితే ఏ క్షణంలో నైనా సమ్మె చేస్తామని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. పంచాయతీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే జీవో నం. 51ని సవరించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలన్నారు. 2011 జనాభా ప్రకారం కాకుండా ఇప్పటివరకు విధులు నిర్వహిస్తున్న వారందరి పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జీవో నం.60 ప్రకారం కేటగిరీలవారీగా విధులు నిర్వహిస్తు న్నవారికి విధానాలు సవరించాలన్నారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే ఏ క్షణంలోనైనా నియోజకవర్గ దీక్ష చేపడతామని డీపీవోకు ఇచ్చిన సమ్మె నోటీసులో పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కమిటీ చంద్ర శేఖర్, కార్యదర్శి పులి మల్లేశం, వంద రాజేశం, కమిటీ సభ్యులు రాజేందర్, ఎల్లయ్య, మహేష్, రాజయ్య, లచ్చన్న పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం చేయనున్న ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను తపస్ రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారానికి దీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తపస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ, నాయకులు వేముల మధు, తపస్ మండల శాఖ అధ్యక్షుడు రజనీకాంత్, ప్రధాన కార్యదరి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, ఎండీ నజీం పాల్గొన్నారు.

అందరికీ సీపీఆర్‌పై అవగాహన

అప్పుడే గుండె పోటు నుంచి ప్రజలకు రక్షణ

పోలీసులకు శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

జగిత్యాల అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) సీపీఆర్‌పై అందరికీ అవగాహన కల్పించినపుడే ప్రజలను గుండెపోటు నుంచి రక్షణ కల్పించ గలుగుతామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ భవనంలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల గుండెపోటుతో పలువురు మరణించడం బాధాకరమని, దీని ద్వారా ఎవరు మృతి చెందవద్దనే ఉద్దేశ్యంతో పోలీస్ అధికారులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీపీఆర్‌పై ప్రతీఒక్కరికి అవగాహన ఉన్నపుడే కార్డియా మరణాలు చాలా వరకు అదుపులోకి వస్తాయన్నారు. సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణ అందడం ద్వారా, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులకు ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యే వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నందున అన్ని స్థాయి ల్లో ఉన్న పోలీసులకు సీపీఆర్ శిక్షణ ఇవ్వ డం వలన అలాంటి వ్యక్తుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. శిక్షణ జిల్లాలో విడతల వారీగా పెట్రోల్ బంకుల్లో పనిచేసే వారికి, ఆటో డ్రైవర్లకు, హోటళ్లలో పని చేసే సిబ్బందికి ఇవ్వడం ద్వారా గుండె మరణాలు చాలా వరకు నియంత్రణలోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్, ఐఎంఏ కార్యదర్శి శ్రీనివాస్, మరియు వైద్యులు సుధీర్ కుమార్, నరేష్, హిమబిందు పాల్గొన్నారు.

హైడ్రాపై ప్రతిపక్షాల అసత్య ప్రచారం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో చేపట్టిన హైడ్రాపై ప్రతి పక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో రూ.5 లక్షలతో మురికి కాలువలపై స్లాబు, రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అక్రమార్కుల చెరలో ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న భూములను రక్షించడానికి ప్రభుత్వం హైడ్రా చేపట్టిందని, హైడ్రాకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను ప్రజలు నమ్మవద్దన్నారు. జగిత్యాల పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని, ఇప్పటికే పట్టణంలో ప్రతి వార్డులో కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియో గాన్ని తగ్గించాలని ఎమ్మె ల్యే ఎమ్మెల్యే, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సి పల్ కమిషన్ చిరంజీవి, కౌన్సిలర్లు సిరికొండ పద్మ, గుగ్గిల్ల హరీష్, పంబాల రాము, నవీన్, నాయకులు చెట్‌పెల్లి సుధాకర్, సింగారావు, సాయి, రాము, ఎలగందుల రవి పాల్గొన్నారు.

● జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన చిట్టపల్లి నాగరాజుకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన లక్షా 1,16ల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం అందజేశారు. ఆయన వెంట పులిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో అరెస్టయిన రైతుకు బేడీలు వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం కథలాపూర్‌లో బీజేపీ శ్రేణు లు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బస్టాండ్ వద్ద వేముల వాడ - కోరుట్ల రహదారిపై అరగంట సేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడి పల్లి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మిర్చి రైతు లకు బీఆర్ఎస్ సర్కారు బేడీలు వేయగా ఇప్పుడు హీరానాయక్ అనే రైతుకు గుండెపోటు రాగా ఆసుపత్రికి బేడీలు వేసి తీసుకెళ్లడం దారుణమని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపు చూస్తుందనడానికి ఇదో నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంక టేశ్వర్ రావు, మల్యాల మారుతి, కాశోజీ ప్రతాప్, మంగళి మహేశ్, బద్రి సత్యం, అద్వానీ ఉన్నారు.



కథలాపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మినీ ఏటీఎం కేంద్రాలే టార్గెట్..



- బిర్యాణి, ఫాస్ట్‌ఫుడ్ ఆర్డర్ల పేర టోకరా
- బ్యాంకు సెలవు రోజుల్లోనే మోసాలు
- గోదావరిఖని, పెద్దపల్లిల్లో వరుస ఘటనలు

కోల్‌సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కీమ్‌లు, లాటరీలు, బ్యాంకు రుణాల పేరిట మోసాలకు పాల్పడిన సైబర్ నేరస్థులు కొత్త తరహాలో మోసగించేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఫోన్లలో స్థానికులుగా పరిచయం చేసుకుంటూ నమ్మబలుకుతున్నారు. స్థానికంగా ప్రముఖులు, వ్యాపారస్థుల పేర్లు చెప్పి మాటల్లోకి దించుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ నగదు బదిలీ కేంద్రాలు, మినీ ఏటీఎంలలో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో నగదు బదిలీ అవుతుండడాన్ని ఆసరాగా చేసుకుని వాటినే టార్గెట్‌గా చేస్తున్నారు. ఫుడ్ ఆర్డర్ల పేర ఏక కాలంలో రెస్టారెంట్ల నిర్వాహకులు, మినీ ఏటీఎం నిర్వాహకులకు ఒకరికి తెలియకుండా ఒకరికి ఫోన్లు చేసి టోకరా వేస్తున్నారు. నిమిషాల్లోనే మాయచేసి వేలకు వేలు దండుకుంటున్నారు. బ్యాంకుల సెలవు రోజులనే టార్గెట్‌గా చేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని, పెద్దపల్లిల్లో ఈ తరహా వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి.

పది నిమిషాల వ్యవధిలోనే

అదే రోజు పది నిమిషాల వ్యవధిలోనే గోదావరిఖని మెయిన్ రోడ్డులోని ఒక మినీ ఏటీఎం సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు తాను మార్కండేయ కాలనీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి ఎండీనని, తనకు పెట్రోల్‌బంక్‌లు, ఇతర వ్యాపారాలు ఉన్నాయని నమ్మబలికాడు. వరుసగా బ్యాంకులకు సెలవులు ఉన్నాయని, అందువల్ల తనకు డబ్బులు బదిలీ చేయాల్సిన అవసరం ఉందన్నాడు. తన ఉద్యోగి వస్తాడని, కమీషన్ తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌లోకి పంపాలని సూచించాడు. అదే సమయంలో మినీ ఏటీఎం దగ్గరే ఉన్న మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానికి ఫోన్ చేసి తనకు కొన్ని పార్సల్స్ అవసరమని, డబ్బులు పక్కనే ఉన్న మినీ ఏటీఎం నుంచి తీసుకోవాలని అతనికి సూచించాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు మినీ ఏటీఎం వద్దకు వెళ్లగా ఏటీఎం నిర్వాహకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడిని తనకు ఫోన్ చేసిన ఆసుపత్రి ఎండీ వద్ద పనిచేసే ఉద్యోగిగా భావించాడు. అతడు రావడంతోనే రూ.55వేల సొమ్మును ఆసుపత్రి ఎండీగా చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. ముందున్న వ్యక్తే తనకు పార్సిళ్ల డబ్బులు ఇవ్వమని ఏటీఎం నిర్వాహకున్ని అడగడంతో అవాక్కయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ నేరస్థుడు చేసిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సైబర్ క్రైమ్ నెం.1930కు ఫోన్ చేసి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జిల్లా కేంద్రంలోనూ..

ఇటీవల పెద్దపల్లిలోని ఒక నగదు బదిలీ కేంద్రం నిర్వాహకుడికి ఇదే తరహాలో సైబర్ నేరస్థుడు బురిడీ కొట్టించాడు. తనకు 100బిర్యాణి ప్యాకెట్లు అవసరమని ఫోన్‌లో ఆర్డర్ చేశాడు. అడ్వాన్స్ ఇవ్వాలని బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు కోరడంతో భూంనగర్‌లోని మీ సేవ కేంద్రానికి వెళితే రూ.10వేలు ఇస్తాడని, మిగిలిన సొమ్మును తాను ఫోన్‌పే చేస్తానని నమ్మించాడు. అదే సమయంలో ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడికి ఫోన్ చేసిన అగంతకుడు తాను ఒకవ్యక్తి ద్వారా నగదు పంపిస్తున్నానని, ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని సూచించాడు. మీసేవ సెంటర్ నిర్వాహకుడు పని మీద బయటకు వెళుతూ షాపులో పని చేస్తున్న వ్యక్తికి తన పేరు చెప్పి ఎవరైనా వస్తే నగదు బదిలీ చేయాలని సూచించాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు మీసేవా కేంద్రానికి వెళ్లి తనకు ఫోన్ చేసిన వ్యక్తికి మరోసారి ఫోన్‌చేసి మీ సేవలో పని చేస్తున్న వ్యక్తికి ఫోన్ ఇచ్చాడు. నేను మీ యజమానితో మాట్లాడాను, నేను చెప్పిన నంబర్లకు డబ్బులు బదిలీ చేయమనడంతో షాపులో పనిచేస్తున్న వ్యక్తి మూడు నంబర్లకు మొత్తం రూ.55వేలు బదిలీ చేశాడు. మీ ముందున్న వ్యక్తి నగదు ఇస్తాడు, తీసు కోండని ఫోన్ కట్ చేశాడు. ముందున్న వ్యక్తిని డబ్బులు ఇవ్వమని అడుగగా తాను బిర్యాణి సెంటర్ నిర్వాహ కుడినని, తాను డబ్బులు ఇవ్వడం ఏంటి? మీ దగ్గర డబ్బులు తీసుకోమని కస్టమర్ చెబితే వచ్చానని తెలు పడంతో మోస పోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిర్యాణి పాయింట్ల పేరుతో..

సైబర్ నేరస్థులు ప్రజల అవసరాలు, నమ్మకాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. మినీ ఏటీఎంలలో ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా సాగుతుండడంతో వాటినే లక్ష్యంగా చేసుకుంటున్నారు. అను మానం రాకుండా తెలుగులో మాట్లాడుతూ స్థానికంగా పరిచయం ఎక్కువ ఉన్న వ్యాపారులు, ఆసుపత్రి నిర్వాహకుల పేర్లను వాడుకుంటున్నారు. ముఖ్యంగా బ్యాంకు సెలవు దినాల్లో ఆన్‌లైన్ నగదు బదిలీ సెంటర్లకు గిరాకీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడం, రద్దీ సమయాల్లో నిర్వాహకులను ఏమార్చి బురిడీ కొట్టిస్తున్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఒక ప్రముఖ బిర్యాణి సెంటర్ నిర్వాహకులకు రెండు నెలలక్రితం ఫోన్ చేసిన సైబర్ నేరస్థుడు పట్టణానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌గా చెప్పుకున్నాడు. తాను చిన్న పార్టీ ఇస్తున్నానని, 55బిర్యాణి పార్సిళ్లు అవసరమని పేర్కొన్నాడు. బ్యాంకు సెలవు దినాలు కనుక నగదు లేదని, సమీపంలోని మినీ ఏటీఎం పేరు చెప్పి అక్కడికి వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించాడు. సంబంధిత మినీ ఏటీఎంకు ఫోన్ చేసి తాను ఒక మనిషిని పంపుతున్నానని, అతడు నగదు ఇస్తాడని, కమీషన్ ఎక్కువైనా తీసుకుని మిగతా డబ్బులు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. బిర్యాణి సెంటర్ నిర్వాహకుడికి గానీ, మినీ ఏటీఎం నిర్వాహకుడికి గానీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.

బిర్యాణి సెంటర్ నిర్వాహకుడు తమకు ఫోన్ చేసిన కాంట్రాక్టర్ ఆర్డర్ తాలుకా డబ్బు లు ఇస్తారని ఆశించి మినీ ఏటీఎం వద్దకు వెళ్లాడు. తనను సదరు కాంట్రాక్టర్ పంపాడని చెప్పడంతో మినీ ఏటీఎం నిర్వాహకుడు తనకు ఫోన్ చేసి నగదు బదిలీ చేయమన్న వ్యక్తి తన మనిషిని డబ్బులు ఇచ్చి పంపాడేమోనని భావించాడు. వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకోకుండానే ఫోన్‌లో చెప్పిన వ్యక్తి అకౌంట్‌కు రూ.45వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు పంపిన తరువాత తన ముందున్న వ్యక్తికి నగదు ఇవ్వమని అడుగగా అసలు విషయం బయట పడింది. తాను బిర్యాణి సెంటర్ నుంచి వచ్చానని, తనకే ఇక్కడ డబ్బులు ఇస్తారని ఫోన్ చేశారని తెలుపడంతో అసలు మోసం బయట పడింది.

స్థానిక వ్యాపారుల పేర్లు, వివరాలతో మోసాలు..

సైబర్ నేరస్థులు ఇన్నాళ్లు ఫోన్ నంబర్ల ఆధారంగానే మోసాలకు పాల్పడేవారు. ఇప్పుడు మీసేవా నగదు బదిలీ కేంద్రాలు, ప్రముఖ వ్యాపార సంస్థల వివరాలు గూగుల్ మ్యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో నిర్వాహకుల పేర్లు, వ్యాపార వివరాలను సైబర్ నేరస్థులు సేకరిస్తున్నారు. వీటి ఆధారంగానే సులువుగా మోసాలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసి తాము మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్‌ల సొమ్ము ఏకకాలంలో తాము చెప్పిన నంబర్లకు ఫోన్‌పే ద్వారా పంపాలంటూ ఒత్తిడి చేశారు. దీంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

అప్రమత్తతోనే రక్షణ...

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసపోకుండా రక్షణ పొందే అవకాశం ఉంటుంది. ఏ చిన్న ఫోన్‌కాల్ విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి సంపత్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సంపత్ గతనెల 17న తన మోటర్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించక పోవడంతో సంపత్ భార్య క్యాదాసి ప్రవంతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పెద్దూరి మల్లయ్య (56) అనే రజకుడు దుస్తులు ఇస్త్రీ చేస్తూ శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. గ్రామానికి చెందిన మల్లయ్య తన కుల వృత్తిలో భాగంగా స్థానికంగా ఓ డబ్బాను ఏర్పాటు చేసుకొని దుస్తులు ఇస్త్రీ చేసేవాడు. రోజులాగే డబ్బాలో దుస్తులను ఇస్త్రీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజన సంఘం నాయకులు, స్థానికులు కోరారు.

ఆర్థిక ఇంబందులతో యువకుడి ఆత్మహత్య..

ముస్తాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కంచం సురేశ్(29) అనే యువకుడు శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన సురేశ్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సురేశ్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పితో వివాహిత ఆత్మహత్య

వేములవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన సోమినేని మౌనిక (30) అనే వివాహిత కడుపునొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మౌనిక కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మౌనిక తండ్రి తిరుపతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

ప్రపంచ చెస్ చాంపియన్‌గా

గుకేష్ గెలుపుపై సంబరాలు



సంబరాలు నిర్వహిస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగ చాంపియన్‌గా నిలిచిన గుకేష్‌కు అభినందనలు తెలియజేస్తూ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ స్టేడియం ఆవరణలో ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ క్రీడాకారులు, నగరంలోని క్రీడాకారులు భారీ ర్యాలీ నిర్వహించి, బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అతిథిగా పాల్గొన్న ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చాంపియన్‌గా గుకేష్ గెలవడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, పీడీ అంతటి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, చదరంగ బాధ్యులు అరుణ్, అనూష్, గౌతమ్, అభి, వెంకటేశ్, పీఈటీలు, చదరంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన వారికి రౌడీషీట్ల నుంచి విముక్తి

- సమీక్షకు డీసీపీ ఆధ్వర్యంలో కమిటీ
- పదేళ్ల క్రితం నమోదైన షీట్లపై పరిశీలన



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రౌడీషీటర్ల జాబితాలో ఉండి సత్ప్రవర్తన కలిగిన వారికి షీట్ల నుంచి విముక్తి కల్పించాలని ప్రభుత్వం సూచనలు చేసింది. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో సత్ప్రవర్తన కలిగి, ఎలాంటి వివాదాలకు, నేరాలకు పాల్పడకుండా ఉన్న వారిని మానవీయ కోణంతో షీట్లపై సమీక్షించాలని పోలీస్ కమిషనర్ నిర్ణయించారు. పది సంవత్సరాల క్రితం రౌడీషీట్ నమోదై ఇప్పటి వరకు సత్ప్రవర్తన కలిగి ఉండి, ఎలాంటి నేరం చేయకుండా సాధారణ జీవితం గడిపితే వారి షీట్లు తొల గించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత షీట్ల సమీక్షకు డీసీపీ చేతన ఆధ్వర్యంలో ఎస్‌బీ ఏసీపీ, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలతో ఒక కమిటీని ఏర్పా టు చేశారు. ఈ కమిటీ రౌడీషీటర్లు, కేడీ, సస్పెక్ట్ తదితర షీట్లపై సమీక్ష చేయనున్నది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాలో పోలీస్ రికార్డుల ప్రకారం 223మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఇందులో గోదావరి ఖని వన్‌టౌన్‌లో అత్యధికంగా 59మంది రౌడీషీటర్లు ఉన్నారు. టుటౌన్‌లో నలుగురు, కమాన్‌పూర్‌లో ఇద్దరు, ఎన్‌టీపీసీలో 22, రామగుండంలో 4, మంథని లో 24, రామగిరిలో 12మంది రౌడీషీటర్లు ఉన్నారు. అలాగే పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పెద్దపల్లి ఠాణా పరిధిలో 14, ధర్మారం 26, బసంత్‌నగర్ 18, సుల్తానాబాద్ 19, పాలకుర్తి 8, కాల్వశ్రీరాంపూర్ 2, జూలపల్లిలో 9షీట్లు ఉన్నాయి. గతంలో తీవ్ర నేరాలు, హత్యలు, హత్యాయత్నాలు, బహిరంగ దాడుల కు పాల్పడడం, బెదిరింపులు, బలవంతపు వసూళ్లు తదితర కేసులను దృష్టిలో ఉంచుకుని రౌడీషీట్లు తెరిచారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం లో క్రూరమైన హత్యలు, నడిరోడ్డుపై దాడులు, మూకదాడులు, హత్యాచార యత్నాలను పరిగణలోకి తీసుకుని షీట్లు తెరిచారు. గతంలో కొందరు రౌడీషీ టర్లు షీట్లు తెరిచినా కూడా తమ ప్రవర్తన మార్చుకోకుండా ఇప్పటికీ బెదిరింపులు, గొడవలకు పాల్పడడం, కేసులు నమోదు అవడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మరికొందరు షీట్లు నమోదు అయినప్పటి నుంచి నేరాలకు, గొడవలకు దూరంగా ఉంటున్నారు. కొందరు తమపై ఉన్న షీట్లను తొలగించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. కొందరు ఏళ్ల తరబడి ఠాణాల చుట్టూ తిరుగుతు న్నారు. ఇందులో 25ఏళ్ల క్రితం రౌడీషీట్లు నమోదు అయిన వారు కూడా ఉన్నా రు. మొత్తంగా నేర ప్రవృత్తికి దీర్ఘకాలంగా దూరంగా ఉన్న రౌడీషీట్లపై రామగుండం పోలీస్ కమిషనర్ పరిశీలన చేస్తుండడంతో రౌడీషీటు ఉన్న సాధారణ జీవితం గడుపుతున్న కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రోడ్డు పక్కన దేశ నాయకుల ఫొటోలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోడ్డు పక్కన పడేసిన దేశనాయకుల ఫొటోలు

కొడిమ్యాల, డిసెంబరు13 (ఆంధ్ర జ్యోతి): కొడిమ్యాల నుంచి పూడూర్ వెళ్లేదారిలో రోడ్డు పక్కన శుక్రవారం దేశ నాయకుల ఫొటోలు కనిపించాయి. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్, జాతిపిత మహా త్మాగాంధీ చిత్రపటాలతో పాటు మరి కొంత మంది మహనీయుల ఫొటోలు రోడ్డు వెంట వెళ్లేవారిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు కొత్తూరి స్వామి, అధ్యక్షుడు సురుగు శ్రీను మాట్లాడుతూ మహనీయులను అవమాన పరిచే విధంగా ఫొటోలను రోడ్డుపై పడేసిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యవర్గం



జిల్లా కన్వీనర్ రాజయ్య



కో కన్వీనర్ పోచమల్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్, కో కన్వీన ర్లను నియమిస్తూ వేదిక రాష్ట్ర అధ్య క్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ప్రకట న జారీ చేశారు. జిల్లా కన్వీనర్‌గా ఆసర రాజయ్య యాదవ్, కోకన్వీన ర్‌గా పోచమల్లు యాదవ్‌ను నియమించారు. జిల్లాలో యాదవ విద్యావం తుల వేదికను పటిష్ట పరిచే విధంగా కృషిచేయాలని సూచించారు. వీరి నియామకం పట్ల పలువురు వేదిక నా యకులు, యాదవులు హర్షం వ్యక్తం చేశారు.

మహా శివరాత్రి వరకు సౌకర్యాలు కల్పించాలి

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వరకు భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుక రావాలని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సారంగాపూర్ మండలంలోని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవాలయాన్ని బీఆర్ఎస్ నేతలతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీగా కవిత గతంలో మంజూరు చేసిన రూ 86 లక్షల నిధులతో చేపట్టిన గోపురం, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ పనులు వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటించి పూర్తి చేయించాలని ఆమె తెలిపారు. అలాగే బీర్‌పూర్ లక్ష్మీ నరసింహ స్వామి, జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాలకు కూడ నిధులు మంజూరు చేసినట్లు ఆమె గుర్తు చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ సారంగపూర్ మండల అధ్యక్షులు తేలు రాజు, సారంగపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, మండల యూత్ అధ్యక్షులు సిలివేరి మదన్, ఒడ్నాల జగన్, అత్తినేని నరేష్, ఆకుల తిరుపతి, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, రమేష్, జలందర్, అలీం, వేణు, రవి, బండారి వెంకటేష్, సుమన్‌నాయక్, అరవింద్‌గౌడ్, రవిగౌడ్, శ్రీను, రాజరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

ఘనంగా అయ్యప్ప పడి పూజా మహోత్సవం



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిలక్‌రోడ్డులో అయ్యప్ప పడిపూజ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వేదపండితుడు పాలెపు రామకృష్ణ మంత్రోచ్ఛారణల మధ్య పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కాలనీకి చెందిన రుద్ర వసంత్ కుమార్ కన్నె స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాముల ఉత్సవ మూర్తులకు అభిషేక కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను జరిపారు. వేంకటేశ్వర భజన మండలి గురుస్వామి గట్ల అనంద్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహిచారు. రుద్ర వసంత్ కుమార్ స్వాములకు అన్న ప్రసాదం అందించగా బారీగా స్వాములు పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అంబల్ల శ్రీనివాస్, జుంబర్తి రమేష్, ప్రశాంత్, సాయి, తోట రాజు, గడ్డం మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్గీకరణపై సీఎం స్పందించాలి

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు, అంబేడ్కర్ సంఘ నాయకులు

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో మహిళా సోదరీమణులు డప్పు కళాకారులు సిందు మాదిగల ఆధ్వర్యంలో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ 32 సంవత్సరాలుగా పలు పార్టీలు కమీషన్లు, కమిటీలు వేస్తూ వస్తున్నారని ఇప్పటి వరకు ఏ ఒక్క నాయకుడు గానీ పూర్తిస్థాయిలో వర్గీకరణ చేపట్టలేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో భారతదేశంలోనే మొట్ట మొదటిసారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఏకగ్రీవంగా తీర్మానం చేసి వర్గీకరణ చేస్తామని వాగ్దానం చేసారని అన్నారు. ఇప్పుడు ఒక కమిటీ వేశారని కమిటీ కాల యాపన కోసం పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి వనతపుల అంజయ్య, నాయకులు రాజశేఖర్, నారాయణ, ఎర్ర శంకర్, బలవంతుల సురేష్, పేట భాస్కర్, రాజేష్, సీహెచ్ లక్ష్మణ్, శనిగారపు వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు

జమ్మికుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ యువకుడు శుక్రవారం రాత్రి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. మంచిర్యాలకు చెందిన భోగి అఖిల్ తన బాబాయ్ కుమార్తె ఎంగేజ్‌మెంట్ కోసం జమ్మికుంటకు వచ్చాడు. ఒంటిపై దుస్తులు లేకుండా జమ్మికుంట బస్టాండ్ వద్ద యువతులు, మహిళల వద్దకు వచ్చి వీరంగం సృష్టించాడు. యువకుడి ఆగడాలతో విసుగు చెందిన ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్ క్లిక్..

పనులు ఎప్పటికి పూర్తయ్యేను...?

నగరం నుంచి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా చొప్పదండి రోడ్డులో తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభమై ఏడాది దాటినా ముందుకు సాగడం లేదు. ఓవైపు పిల్లర్లు వేసి వదిలేయగా మాణిక్యేశ్వరి గుడివైపు స్లాబ్ దశలో నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రైలు గేటు పడటంతో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



తీగలగుట్టపల్లి వద్ద పిల్లర్ల దశలో నిలిచిపోయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి



రైలు గేటు పడడంతో ప్రయాణికుల ఇక్కట్లు



తీగలగుట్టపల్లివైపు ఓవర్ బ్రిడ్జి స్లాబ్ దశలో నిలిచిపోయిన పనులు

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఆలయాలు ఉదయం 3 గంటలకు తెరచి ఉంచుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉదయం 4 గంటల నుంచి 5-30 వరకు స్వామి వారికి నిత్యం అర్చకులు ప్రత్యేక అభిషేకం, స్వామి వారికి తిరుప్పావై ప్రబంధం జరుపుతారని తెలిపారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారని పేర్కొన్నారు.

నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖని క్రీడాకారుడికి చోటు



సంతోష్ ట్రోఫీ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు అభిషేక్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ నుంచి గోదావరిఖనికి చెందిన అభిషేక్‌కు జట్టులో చోటు లభించింది. గత ఏప్రిల్‌లో గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జట్టు 3వ స్థానంలో నిలువగా సీనియర్ నేషనల్ టీమ్ సెలక్షన్‌లో సంతోష్ ట్రోఫీ కోసం నిర్వహించిన ఎంపిక జట్టులో అభిషేక్ తెలంగాణ జట్టు నుంచి ఆడనున్నాడు. ఎంపికైన అభిషేక్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ గణపతి అభినందించారు.

ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

గణేశ్‌నగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఉదయం మొత్తం 12,220 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 11,205 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు.

'కళ' తప్పిన చిందు యక్షగానం



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వీనుల విందైన సంగీతాన్ని అందించిన వారి హార్మోనియం నేడు మూగబోతోంది.. విశేష ఆదరణ పొందిన చిందు యక్షగానం కళతప్పింది. పాశ్చాత్య సంస్కృతి చిందు యక్షగాన కళను కబళిస్తోంది. చిందు యక్ష కళాకారుల ప్రదర్శన ఉందంటే ఊళ్లోని చిన్నా, పెద్దలు భారీ సంఖ్యలో తరలివచ్చేవారు. రామరావణ, శ్రీకృష్ణార్జున యుద్ధం, అల్లీరాణి, చెంచులక్ష్మి, భక్తప్రహ్లాద, సత్యహరిశ్చంద్ర, గుణసుందరికథ, చిరుతల రామాయణం తదితర నాటకాలను రాత్రంతా ఆసక్తిగా చూసేవాళ్లు. ఊళ్లో నాటకం ఉందంటే చుట్టు పక్కల గ్రామాల వారు ఎడ్లబండ్లపై ఉత్సాహంగా తరలివచ్చిన రోజులు ఉన్నాయి. ఆనాడు కళాకారులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కళాకారులకు డబ్బులు, ధాన్యంతోపాటు వస్త్రాలు, కానుకలు ఇచ్చి సత్కరించేవారు. టీవీలు, సినిమాలు రాకతో చిందు యక్షగానకళలతో పాటు వీధి బాగోతాలు, బుర్రకథ, హరికథలు అంతరించే దశలో ఉన్నాయి. ఆదరణ కరువై కళాకారులకు ప్రదర్శనలు లేక జీవనోపాధి కరువైంది. దీంతో కుటుంబ పోషణ కోసం కొందరు కళాకారులు కూలీలుగా మారారు. ఆదరణ లేక ఈ కళను నేర్చుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చిందు యక్షగానం ప్రాభవం కోల్పోతున్నది.

● చిందు యక్షగానం.

చిందు యక్షగానాన్ని సుమారు 12మంది సభ్యులు రక్తి కట్టిస్తారు. హార్మోనియం, తబలా, తాళాలు ప్రధాన వాయిద్యాలు. ఏ నాటకం వేసినా ఒకరు విలన్, ఒకరు హీరో, ఒకరిద్దరు ఆడవేషాలు, ఒక బుడ్డరఖాన్, సహాయకులు ఒకరిద్దరు, మిగతా వారందరూ వాయిద్య సహకారం, కోరస్ అందిస్తారు. నాటకాన్ని మూడు నుంచి ఐదు రోజుల వరకు వేసేవారు. ఊరందరూ కలిసి వీరిని ప్రతి సంవత్సరం పిలిపించుకొని శుభకార్యాల్లో నాటకాలు వేయించేవారు. భోజనం, విడిది ఏర్పాటు చేసేవారు.

● వారి కోరికలివే...

నెలనెలా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కళాకారులను ఆర్థికపరంగా ఆదుకోవాలని, చిందుయక్షగాన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని, సంఘ భవనాన్ని నిర్మించి, పింఛన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● కరవైన ఉపాధి

చిందు యక్షగాన కళ ప్రదర్శనలు లేక నిరాదరణకు గురవుతున్నది. ప్రదర్శనలు లేకపోవడంతో కళాకారులకు పూట గడవడం కష్టంగా మారింది. అప్పుడప్పుడు ఎవరైనా ప్రదర్శనకు పిలిస్తే వెళ్లి కళకు జీవం పోస్తున్నారు. గతంలో ప్రభుత్వాలు అక్షరాస్యత నిర్మూలన, కుటుంబ నియంత్రణ, సంపూర్ణ పారిశుధ్యం, జన్మభూమి తదితర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా కళాకారులకు ఉపాధి కల్పించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోక నానాటికీ వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.



ప్రదర్శనలో వేషధారణ (ఫైల్)

● తీగలగుట్టపల్లిలో వంద కుటుంబాలు

కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లి గ్రామంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా చిందు కుటుంబాలు ఉన్నాయి. గతంలో నాటక ప్రదర్శనతో ఉపాధి పొందిన కళాకారులు ప్రస్తుతం పూట గడవని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒక వైపు ప్రదర్శనలు లేకపోవడం, మరో వైపు ప్రభుత్వ పథకాల ప్రచారంలో అవకాశం కల్పించకపోవడంతో కళాకారులు ఇతర వృత్తులను ఆశ్రయించారు. యువకులు ఈ వృత్తిని విడిచి ఉపాధినిచ్చే వృత్తుల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం ఈ గ్రామంలో పదుల సంఖ్యలో మాత్రమే వృద్ధ కళాకారులున్నారు. నలుగురికి తప్ప కొందరికి వృద్ధకళాకారులకిచ్చే పింఛన్ సైతం మంజూరు కాకపోవడంతో ఆర్థికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురికి నివాస గృహాలు కూడా లేకపోవడంతో పూరి గుడిసెల్లో జీవితం గడుపుతున్నారు.



2003లో శాతవాహన కళోత్సవాల్లో పాల్గొన్న కళాకారులు (ఫైల్)

● ప్రభుత్వం ఆదుకోవాలి



ఒకప్పుడు యక్షగాన ప్రదర్శనల ద్వారా కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. కళాకారులకు, కళకు గౌరవముండేది. ఇప్పుడు ఆదరణ లేకపోవడంతో ఉపాధి కరువయింది. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాల్లో సైతం అవకాశమివ్వకపోవడంతో ఉపాధిలేక రోడ్డున పడ్డాం. ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు చేపట్టాలి.

- గజవెల్లి కిష్టయ్య, చిందు యువజన యక్షగాన కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

● ఆసరాగా నిలవాలి



కళాకారులకు తగిన ప్రాధాన్యం కల్పించి ప్రదర్శనలకు అవకాశం కల్పించి ఆదుకోవాలి. కళాకారులకు పింఛన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

- గడ్డం అంతయ్య, కళాకారుడు

పశుగ్రాసానికి డిమాండ్

- గడ్డి కట్ట ధర రూ. 80
- మెట్ట ప్రాంతానికి తరలిస్తున్న పశుపోషకులు



దమ్మక్కపేటలో పశుగ్రాసాన్ని తీసుకెళ్తున్న రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతంలో పశుగ్రాసానికి భలే డిమాండ్ ఉంది. గత ఏడాది యాసంగిలో వరి పంటలు నీళ్ల లేక ఎండిపోయాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే రైతులు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు. వరి కోతలు దాదాపుగా పూర్తయ్యాయి. రైతులు తమ పశువుల మేత కోసం గడ్డిని సేకరిస్తున్నారు. కొంత మంది రైతులు గడ్డిని రోలర్ తెప్పించుకొని గడ్డి కట్టలు చుట్టించుకుంటున్నారు. ఒక వరిగడ్డి కట్టకు మెట్ట ప్రాంత రైతులు రూ. 80 చెల్లిస్తున్నారు. మెట్ట ప్రాంతమైన సైదాపూర్, హుస్నాబాద్, భీమదేవరపల్లి, కోహెడ, ఎల్కతుర్తి, జనగామ, స్టేషన్ ఘణపూర్ తదితర ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి ఇంటికి పాడి పశువులు ఉండడంతో ఈ పశుగ్రాసాన్ని సేకరిస్తున్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉంటుందనే భయంతోనే ముందుగానే రైతులు జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు ఆసక్తి కనబరుస్తుండడంతో పశువుల పేడకు డిమాండ్ ఉంది. దీంతో పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. పశువుల పేడకు ట్రాక్టర్‌కు రూ. 3వేల ధర పలుకుతుండడంతో రైతులకు ప్రయోజనంగా ఉందని చెబుతున్నారు.



సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో నిల్వ చేసిన గడ్డి కట్టలు

పరిశోధనలతోనే విప్లవాత్మక మార్పులు

- రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి - జయశంకర్ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో వక్తలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాల వల్లనే వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, క్షేత్రస్థాయి రైతులకు ఇవి అందినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పడి 60ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పరిశోధన స్థానంలో ముందస్తు వజ్రోత్సవాలు ఏడీఆర్ గాదె శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అతిథులుగా ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, దాని కొనసాగింపునకు మరింతగా కృషిచేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల సాగు విధానం వైపు వెళ్లకుండా, వాణిజ్య లాభాదాయ పంటల వైపు దృష్టిని మరల్చి అధిక లాభాలు పొందాలని సూచించారు. హైదరాబాద్ శంషాబాద్ వద్ద హైడ్రోఫోలిఫ్ విధానంతో సుమారు వెయ్యి ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారని, ఆ విధానం మన వద్ద కూడా అవలంబిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వజ్రోత్స వాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ సందదర్భగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

- ఆకట్టుకున్న స్టాల్స్..

యూనివర్సిటీ వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ రైతులను, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రైతులకు అవసరమైన పరికరాలు, పనిముట్లు, వంగడాలను ఈ స్టాల్స్‌లో ప్రదర్శించారు. విత్తన ప్రదర్శన కార్యక్ర మంలో భాగంగా తెలంగాణ ప్రాంతంతో పాటు జిల్లాలో సాగు చేస్తున్న వివిధ వంగడాలతోపాటు, చెరుకు, మొక్కజొన్న, సోయ వంటి ఉత్పత్తులను, వాటి దిగుబడులను అతిథులకు విద్యార్థు లు, శాస్త్రవేత్తలు వివరించారు.

విద్యావంతులకు సాగుపై ఆసక్తి..

- వెల్ముల రాంరెడ్డి, రైతు, పూడూర్



కొందరు విద్యావంతులు సాగుకు ఆసక్తి చూపుతూ, నూతన విధానాలతో రాణిస్తుండడం అభినందనీయం. జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఈ యేడాది వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం శుభ పరిణామం. 60ఏళ్లలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి జరిగిన మాట వాస్తవమే. కొత్త వంగడాలు, యాంత్రీకరణ జరిగింది. కానీ ప్రస్తుత వ్యవసాయంతో బతుకుదెరువు ఉందనే భరోసా లేకుండా పోతోంది. రైతు వారసులు అంతగా వ్యవసాయం వైపు ఆసక్తి చూపడం లేదు.

మార్కెటింగ్ విధానంపై పరిశోధనలు జరగాలి..

- పులి లక్ష్మీపతి, రైతు, బోయినిపెల్లి



వ్యవసాయ పరిశోధన స్థానంతో దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రస్తుత యేడాది యూనివర్సిటీ వజ్రోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. కానీ నూతన వరి వంగడాలు కనుగొనడం, వాటి ఫలాలను రైతుల చెంతకు చేర్చడంలో జాప్యం జరుగుతున్నది. జాప్యాన్ని నిలువరించే చర్యలు తీసుకోవాలి. ఆంధ్రా వంగడాల మాదిరిగా, తెలంగాణ వంగడాలు పోటీని అధిగమించలేకపోతున్నాయి. రైతు ఆలోచనలు, ఆకాంక్షలతో పాటు వారి అభివృద్ధికి అను గుణంగా పరి శోధనలు జరగాలి. భవిష్యత్తులో పీజేటీఏయూ చర్యలు తీసుకునేందుకు ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాం.

వైద్య సేవలపై తనిఖీ బృందం పరిశీలన



సభ్యులకు స్వాగతం పలుకుతున్న వైద్య సిబ్బంది

వీణవంక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలోని పీహెచ్‌సీలో అందుతున్న సేవలను పరిశీలించేందుకు శుక్రవారం జాతీయ నాణ్యత పరిశీలన అధికారులు వచ్చారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, మెడికల్ ఆఫీసర్ వరుణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ శరమ భాను, డాక్టర్ శర్మ, భరత్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ వరుణ, ఎంసీహెచ్ సన జవీరా తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

త్యాగరాజ ఉత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో 18 జనవరి 2025 నుంచి 22 జనవరి వరకు నిర్వహించనున్న త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలకు కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారుల శాస్త్రీయ, సంగీత, జంత్రవాద్య సోలో, హరికథ, నృత్య, నాటక, ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండి కోపుల రవి, టీఆర్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ డిమాం డ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమి టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఎస్‌వోలు, యూ ఆర్ఎస్ ఎస్‌వోలు, ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలి పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘాలకు చెందిన పలువురు మద్దుతు తెలిపారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, వెంకట రమణ, పద్మ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, సలీం, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.



పెద్దపల్లిలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకశిలా పార్కు వద్ద ఇచ్చిన హామీని అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. పెద్దపెల్లి దీక్ష శిబిరాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు. టీటీయూ ప్రెసిడెంట్ రవి కుమార్ జనరల్ సెక్రెటరీ మానసూర్ సీపీఐ జిల్లా సీక్రెట్ తాండ్రా సదానందం ఏఐఎస్ఎఫ్ ప్రెసిడెంట్ మనస కుమార్ మద్దతు ప్రకటించారు శుక్రవారం రోజున మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి రోడ్డుపై పెట్టి ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు తిప్పని తిరుపతి. కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు పుల్లూరి సంధ్యారాణి. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు కుంబాల సుధాకర్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి మల్లన్న, రామగిరి రవిరాజు, కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారులు స్వప్న, విజయలక్ష్మి, కమల, జ్యోతి, స్వప్న, జిల్లా నాయకులు పిల్లి రమేశ్, ఆర్ కృష్ణయ్య, సీఆర్పీలు, పీజీ సీర్పీలు, కోఆర్డినేటర్లు, సీసీవోలు, మెసెంజర్లు 250మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లగిచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా కమాన్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అల్లుడి ఫార్మా కంపెనీని సొంత భూముల్లో ఏర్పా టు చేసుకోకుండా దళిత నిరుపేద గిరిజన రైతుల భూములు లాక్కోవడం ఎందుకో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దుబాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, గుంజేటి శివకుమార్, అవుదుర్తి శ్రీనివాస్, పురం హరిశంకర్, తణుకు సాయికృష్ణ, కలికోట మోహన్, మాచర్ల కోటేష్, పోరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైమ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు అపార్ట్‌మెంట్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన కుంకుమల్ల శ్రీరాములు(78) తనకుటుంబంతో ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ పలుమార్లు చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. శుక్రవారం ఐదో అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకాడు. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాధాకృష్ణ



కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండలంలోని కలికోటకు చెందిన అంబటి రాధాకృష్ణ ఎన్నికయ్యాడు. గత నెల రోజుల నుంచి ఆన్‌లైన్‌లో పోటీ కొనసాగుతుండగా ఫలితాలు పార్టీ విడుదల చేసింది. ఇద్దరు పోటీలో ఉండగా అత్యధికంగా రాధాకృష్ణకు ఓట్లు పోలవడంతో ఎన్నికైనట్టు ప్రకటించారు. రాధాకృష్ణను మండల నాయకులు కాయితి నాగరాజు, అజీం, ముద్రకోల అనిల్ కుమార్, లావుడ్య రాజేశ్ అభినందించారు.

దేవాలయ అభివృద్ధికి విరాళాల సేకరణ

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన పలువురు విరాళాలను ప్రకటించారు. పట్టణంలోని రైల్వే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ. 21,116, రుద్ర వసంత్ కుమార్ రూ. 21,516 ప్రకటించి నగదును దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

వర్గీకరణపై అవగాహన

కొడిమ్యాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రలంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్సీ విద్యార్థులకు ఏబీసీడీ వర్గీకరణపై జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు అవగాహన కలిపించారు. జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్య క్షుడు శ్రీను (జగన్) మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీకి పూనుకున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాదిగ విద్యార్థులు మరో సమరానికి సిద్ధం కావాలన్నారు. మాదిగ విద్యార్థులు ఎస్సీ వర్గీకరణ సాధనకు మందక్రిష్ణ మాదిగ చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. అంబేద్కర్ సంఘాల రాష్ట్ర నాయకుడు స్వామి, నరేష్, రమేష్, శ్రీనివాస్, వరుణ్‌రాజ్, వంశీ, రఘుపతి ఉన్నారు.

సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్



జీవన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చి, వారిని క్రమబద్ధీకరించాలని పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యో గులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన అశోక్‌కుమార్ అనంతరం మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ మేరకు వారిని విద్యాశాఖలో విలీనం చేయాలని, తక్షణమే పేస్కేల్ వర్తింపజేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. నీళ్లు, నిధులు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే బాటలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెళ్లకుండా సానుకూల ధృక్పతంతో వ్యవహరించాలని కోరారు.

ఈ సమ్మెలో భాగంగా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల వైఖరితో అన్యాయానికి గురవుతున్నార న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నిర్వర్తించే విధులు కేంద్రం కన్నా రాష్ట్రానికే ఎక్కువ ఫలితాలు ఉన్నాయని తెలిపే విధంగా ఫ్లెక్సీలో త్రాసును ఏర్పాటు చేసి సేవలను వివరించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. సమ్మె అనంతరం సాయంత్రం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసి, పేస్కేల్ అమలు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. స్పందించిన జీవన్‌రెడ్డి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి



పెగడపల్లిలో ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

పెగడపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన బోజనాన్ని వడ్డించాలని పెగడపల్లి తహసీల్దార్ బి.రవీందర్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. హాస్టల్‌లో బెడ్లు, టాయిలెట్లు, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం మెనూ ప్రకారం ఇస్తున్నారా అడిగి తెలుసుకున్నారు.

వారి వెంట పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ

బీర్‌పూర్: మండలంలోని మంగేళ గ్రామంలో గల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను శుక్రవారం రాత్రి బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వంటలు చేస్తున్న వంటగది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వండుతున్న కూరగాయలు తాజాగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. విద్యార్థులు స్టడీ సమయంలో వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, సిబ్బంది ఉన్నారు.

కొడిమ్యాల : మండలంలోని చెప్యాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో ఇ. స్వరూప తనిఖీ చేశారు. వంట గదిలోని బియ్యం, కూరగాయలు ఏ విధంగా ఉన్నాయని పరిశీలించారు. వంట సామగ్రి శుభ్రంగా ఉందాలేదా పరిశీలించారు. వంట సమయంలో మధ్యాహ్న భోజనం తయారు చేసే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ తనిఖీ సమయంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'లక్ష' సాయం ఎటు పాయె..?

(5వ పేజీ తరువాయి)

ఇందులో వెల్గటూరు మండలంలో 92 మందికి, సారంగపూర్ 37, రాయికల్ 60, పెగడపల్లి 63, మెట్‌పల్లి 61, మల్లాపూర్ 93, కోరుట్ల రూరల్ 65, జగిత్యాల రూరల్ 36, జగిత్యాల అర్బన్ మండలం 11, ఇబ్రహీంపట్నం 71, గొల్లపల్లి 68, ధర్మారం 68, ధర్మపురి 51, బుగ్గారం 27, బీర్ పూర్ 33 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున సాయం అందజేశారు. అదేవిధంగా జగిత్యాల మున్సిపాలిటీలో 194 మందికి, ధర్మపురి మున్సిపాలిటీలో 27 మందికి, కోరుట్ల మున్సిపాలిటీలో 61 మందికి, మెట్‌పల్లి మున్సిపాలిటీలో 48 మందికి, రాయికల్ మున్సిపాలిటీలో 21 మందికి లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశారు.

● షరతులు లేకుండానే సాయం...

గత ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక చేయూతనందించాలనే ఉద్దేశంతో రూ. లక్ష ఆర్థిక సాయం పథకాన్ని ప్రవేశపెట్టింది. బీసీ సామాజిక వర్గంలో వడ్రంగి, రజక, నాయిబ్రాహ్మణ మేర, కుమ్మరి, శాలివాహన, కంసాలి, వడ్డెర, కృష్ణ బలిజ తదితర సామాజిక వర్గాల వారికి ఎలాంటి షరతులు లేకుండానే నగదు సాయం చేసింది. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయి. విచారణ అనంతరం ఒక్కో నియోజకవర్గానికి 300 మందికి మించకుండా చెక్కులను అందజేశారు. వందశాతం రాయితీ కావడంతో కొందరు నాయకులు లబ్ధిదారుల నుంచి రూ. 20 వేల చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి.

ఆందోళనలో లబ్ధిదారులు...

లబ్ధి పొందిన బీసీ కులవృత్తి దారులు ఏ పని సామగ్రి కొనుగోలు చేశారు. ఏ ఉపాధిని ఏర్పాటు చేసుకున్నారో..సెల్ ఫోన్‌లో లబ్ధిదారుల ఫొటోతో పాటు పని సామగ్రి, ఉపాధికి సంబంధించిన ఫొటోలు తీసి వినియోగ పత్రాలు అధికారులకు అందజేయాల్సి ఉంది. దీంతో బల్దియాలో ఆర్‌ఐలు, పంచాయతీల్లో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల జాబితా పట్టుకుని యూసీలు సేకరించే పనిలో పడ్డారు. డబ్బులను ఖర్చు చేసి ఏడాదిన్నర తర్వాత ప్రభుత్వం కూపీ లాగు తుండడంతో లబ్ధిదారులు సైతం వినియోగ పత్రాలను ఎక్కడి నుంచి తీసుకురావాలనే ఆలోచనలో పడ్డారు.

యూసీలు సమర్పించాల్సిందే...

గుండేటి సునీత, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి



ప్రభుత్వం గతంలో బీసీ కులవృత్తిదారులకు రూ. లక్ష ఆర్థిక సాయం మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ డబ్బులకు సం బంధించిన యూసీలు సమర్పించాలని ఆదేశించింది. బల్దియా, పంచాయతీ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఉపాధి ఫొటోలను తీసుకుని, బిల్లులు సేకరించి పంపిస్తాం. యూసీలు సమర్పించని లబ్ధిదారులపై ప్రభుత్వం ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన బొంగోని భూమాగౌడ్ భార్య భాగ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మాజీ సర్పంచ్ ఎద్దండి భూమారెడ్డి, నాయకులు బాపురపు నర్సయ్య, దివాకర్ రెడ్డి, షకీర్, నరసింహా రెడ్డి, కడకుంట్ల నరేష్, తలారి రాజేష్, చింతలపల్లి గంగారెడ్డి, గుండేటి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ చెరువు కాలువ భూసేకరణ సభ

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటలో శుక్రవారం సూరమ్మ చెరువుకు సంబంధించిన ఎడమ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో కోరుట్ల ఆర్డీవో జికేందర్‌రెడ్డి గ్రామ సభ ఏర్పాటు చేశారు. సుమారు 73 ఎకరాల భూములు కోల్పోతున్నందు వల్ల రైతులు తమకు గిట్టుబాటు ధరలు అందేలా చూడాలని విన్నవించారు. భూముల కోల్పోతున్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు లేకపోవడంతో తప్పులు సవరించాలని కోరుతూ 12 మంది రైతులు దరఖాస్తులు సమర్పించుకున్నారు. కాగా సూరమ్మ పనుల సందర్భంగా తూము నుంచి నీటిని వదలివేయడంతో పంటలు దెబ్బతిన్నాయని వాటికి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ నవీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్, రైతులు ఉన్నారు.

నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : పరిసరాలలో, ఇంటి అవరణలో నీటి నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డులో డ్రై డేను పురష్కరించుకోని దోమల నివారణకు యాంటి లార్వా స్ప్రే, బ్లీచింగ్ పనులను పరిశీలించారు. అదే విధంగా వన మహోత్సవంలో భాగంగా జాతీయ రహదారి ఉన్నటువంటి శాస్త్రీ చౌరస్తలో నాటిన మొక్కలకు ట్యాంకర్ నీరు పట్టడం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటిలో నీటి నిల్వ ఉంచుకోకుండా 3 రోజులకు ఒకసారి తొలగించాలన్నారు. డివైడర్ల మధ్య ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఇంజనీర్ విష్ణు, ముజీబ్ పాల్గొన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు సమాజంలో అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ కదారి శ్రావణ్, మహిళ సాధికారత అధికారి స్వప్న సూచించారు. వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల్లో మార్పు కోసం సమాజంలో అమ్మాయిలు ఏవిధంగా జాగ్రత్తగా ఉండాలి, పోక్స్ చట్టం గురించి వివరించారు. ఏదైనా సమస్య ఉంటే చైల్డ్ ఇన్సిస్ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ క్రిష్ణ ప్రసాద్, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న జడ్జి

బీర్‌పూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం ధర్మపురి కోర్టు జడ్జి పి.శ్యామ్ సుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు సంతోష్, మధు కమార్, సంతోష్ కుమార్, సిబ్బంది వెంకటేష్ ఉన్నారు

జర్నలిస్టుల ధర్నా

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హైదారాబాద్‌లో టివి9 జర్నలిస్ట్ రంజిత్ పై దాడి చేసిన సిని నటుడు మోహన్‌బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు శుక్ర వారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. మోహన్‌బాబును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీజేపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు జర్నలిస్టు ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శంకర్, మారుతి, షౌకత్ అలీ, ఇలీయాస్, సతీష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, కాంగ్రెస్ నాయకులు ఎండీ ఖుతుబొద్దీన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప రాజలింగం (63) అనే వ్యక్తి తన భూమికి దారి విషయం పరిష్కారం కావడం లేదనే మనస్తాపంతో గురువారం మధ్యాహ్నాం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీపేట గ్రామానికి చెందిన భూక్య మల్లీశ్వరి (20) తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని జీవితంపై విరక్తి చెందిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పంచనామా నిర్వహించారు. మల్లీశ్వరి తల్లి కళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో అమరులైన హిందువులకు నివాళి

కోరుట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో అమరులైన హిందువులకు శుక్రవారం హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో కోవ్వత్తుల ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. పట్టణంలోని కార్గిల్ చౌరాస్తాలో చనిపోయిన హిందు కుటుంబాలకు నివాళులు అర్పించి కోవ్వొత్తుల నివాళిని అందించారు. హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరకట్టే విధంగా ఐక్యరాజ్య సమిత సభ్యులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందు ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

మురుగు కాలువల దుస్థితిపై ఫిర్యాదు

మల్యాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్యాల మేజర్‌గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పు వాడ, మొదటి వార్డు పరిధిలో మురుగుకాలువలు అధ్వనంగా మారడంపై స్థానికులు కాంగ్రెస్ నాయకులకు ఫిర్యాదు చేశారు. మురుగుకాలువలు శుభ్రం చేయడం లేదని దీంతో ఇబ్బందులు పడాల్సివస్తుందని చెప్పడంతో నాయకులు ఆగంతపు వంశీధర్, శనిగారపు తిరుపతి తదితరులు పంచాయితీ ఈవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మురుగుకాలువల శుభ్రం పనులు చేపట్టారు. కాలువల్లోని చెత్తను తొలగించారు

గ్రామపంచాయతీగా జేమానాయక్ తండా..!

● పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆదేశాలతో అధికారుల సర్వేలు
● జిల్లా పంచాయతీ అధికారులకు నివేదిక



కలికోట గిరిజన తండా

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పరిపాలనా సౌలభ్యం కోసం గిరిజన తండాలను గత బీఆర్ఎస్ సర్కారు గ్రామపంచాయతీలుగా మార్చిన క్రమంలో రాజారాం తండాకు పంచాయతీ యోగం పట్టగా... ఇప్పుడు మరో తండాకు గ్రామపంచాయతీ హోదాకు అవకాశం లభించనుంది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సిఫార్సుతో రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ నుంచి సాధ్యాసాధ్యాలపై సర్వేలు చేపట్టాలని ఉత్తర్వులు రావడంతో అధికార యంత్రాంగం హడావుడి చేస్తోంది. గడిచిన రెండు రోజులుగా అటు పంచాయతీరాజ్ విభాగం, అటు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలు ముమ్మరం చేశారు.

● కలికోటకు మూడు కిలోమీటర్ల దూరంలో తండా

వేములవాడ - కోరుట్ల రహదారిపై ఉన్న కలికోట గ్రామపంచాయతీ పరిధిలో సుమార మూడు కిలోమీటర్ల దూరంలో జేమానాయక్ గిరిజన తండా ఉంది. ఇక్కడ 140 మంది ఓటర్లు ఉండగా 200 మంది జనాభా ఉంది. ఇక్కడి నుంచి కలికోటకు ఏ చిన్న పనికైనా గిరిజనులు అష్టకష్టాలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ పథకాల కోసం నిర్వహించే గ్రామసభలు, రేషన్ సరుకులు, వైద్య శిబిరాలు, ఓటు హక్కును వినియోగించుకోవడం, విద్యుత్ బిల్లుల చెల్లింపు, అధికారులు వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేసే అవగాహన సభలకు గిరిజనులు ఇబ్బందులు పడుతూ వెళ్తుంటారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్థానిక గిరిజనులు మొరపెట్టుకుంటూ తమకు ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పిం చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు లేఖ రాశారు. దీంతో సదరు మంత్రిత్వ శాఖ నుంచి జనాభా, ఓటర్లు, విస్తీర్ణం, మౌలిక వసతులు వంటి అంశాలను సర్వే చేసి పూర్తిస్థాయి నివేదిక పంపించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన సర్వేలు పూర్తి చేశారు. నివేదికలు జిల్లా పంచాయతీ అధికారులకు పంపించారని తెలుస్తోంది. ప్రభుత్వానికి నివేదికలు అందగానే ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడడానికి మార్గం సుగమమైనట్టు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా అంబారిపేట కొచ్చెరువు, రుద్రంగి గిరిజన తండాలు రెండు కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది.

● కష్టాలు తీరుతాయి

దరావత్ ప్రకాశ్, గిరిజనుడు



జేమానాయక్ తండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గత ఐదేళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోలేదు. తండావాసులంతా కలిసి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి గోడు చెప్పుకున్నాం. తండా వాసుల కష్టాలను అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తేవడం సంతోషకరం. అధికారులంతా వచ్చి వాస్తవ పరిస్థితిని తెలుసుకుని సర్వేలు చేస్తుండడంతో తండా గ్రామపం చాయతీగా ఏర్పడు తుందనే నమ్మకం కలుగుతోంది.

మెప్మా ఆర్పీల అరెస్టు

రాయికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్‌పీల సంక్షేమ సంఘం పిలుపు మేరకు హైదరాబాద్ మెప్మా కార్యాలయంలో దీక్షకు పిలుపునివ్వగా హైదరాబాద్‌కు వెళ్లిన రాయికల్ మెప్మా ఆర్పీలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు అనిత, రమ్య, జయసుధ, సుమలత, భాగ్య, అనూష, జ్యోత్స్న, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని మెప్మా కార్యా లయంలో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లను శుక్రవారం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 8 నెలల నుంచి వేతనం చెల్లించకపోవడంతో రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు హైదారాబాద్ లోని మెప్మా కార్యాలయానికి ముందు నిరసన తెలిపేం దుకు మెట్‌పల్లి ఆర్పీలు బయలుదేరగా మెట్‌పల్లి బస్టాండ్‌లో పోలీస్‌లు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి మండలంలోని గోవింద్‌పల్లె బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కోల శంకరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరు చేయ బడిన రూ 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును కరీంనగర్‌లో గల తన నివాసంలో మృతుడి భార్య మమతకు శుక్రవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు కొండంత భరోసా అన్నారు. కార్యకర్త మృతి చెందితే రూ 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని ఆయన తెలిపారు. గోవింద్‌పల్లె మాజీ సర్పంచ్ పురంశెట్టి రాజయ్య, కోల రామన్న తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం: బీఆర్ఎస్ ప్రతి కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలం సిరికొండ గ్రామానికి చెం దిన తోవీటి రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, పార్టీ సభ్యత్వ ద్వారా మంజూరైన రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం కొప్పుల ఈశ్వర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్ కొండంత అండగా ఉంటుందన్నారు.

మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, సిరికొండ మాజి సర్పంచ్ దాసరి లచ్చయ్య, చెన్నమల్ల ప్రవీణ్ కుమార్, కుంట మల్లేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, కల్లెడ, లక్ష్మీపూర్, సబ్‌స్టేషన్ పరిధి లలోని పొలాస. గుల్లపేట, కల్లెడ, లక్ష్మీపూర్, గుల్లపేట, అగ్రికల్చర్‌కాలేజీ, లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ కల్లెడ, అనంతారంరొడ్డాం, అనంతారం, తక్కళ్లపల్లి, సంఘంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్, గుట్రాజ్‌పల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని ఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి, రాంపూర్, పోతారం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈలు దయానంద్, శ్రీనివాస్ తెలిపారు. మద్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల, రాంపూర్, ఓబులాపూర్, ఒడ్డెర కాలనీ, పోతారం, రాజారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండకు చెందిన జుంబర్తి నరేశ్ అనే హిందీ ఉపాధ్యాయుడు దేవ నాగరి సేవా సమ్మాన్ పురస్కారం అందుకున్నారు. దేవ నాగరి ఉత్తాన్ సమ్మాన్ ఫౌండేషన్ ఏటా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హిందీ భాషాభివృ ద్ధికి గాను పురస్కారాలను అందిస్తుంది. 2024 సంవత్సరానికి గాను నరేశ్‌ను ఎంపిక చేసి శుక్రవారం హైదరాబాద్‌లో పురస్కారం అందజేశారు. ఉపాధ్యాయుడు ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో హిందీ టీచర్‌గా పని చేస్తున్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

కథలాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు గ్రామాల్లో బూతు కమిటీలను నియమించారు. సిరికొండలో ఐదు బూతులకు ముంజ వెంకటేశ్, తెడ్డు మహేశ్, సిరిమల్లె రాజశేఖర్, ఒజ్జాల రాకేశ్, చిన్నరాజం, గంబీర్‌పూర్‌లో జవ్వాజి రఘు, జవ్వాజి లింగమూర్తి, కమటం అంజయ్య, పెగ్గెర్లలో చీర్ణం శ్రీకాంత్, తేలు అనుదీప్, ఊట్‌పల్లిలో బల్లం రవి నియమించినట్టు చెప్పారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షు డు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, కాశోజీ ప్రతాప్, మహేశ్ ఉన్నారు.